

నేటి నుంచి ఎన్నికల సర్వేలపై నిషేధం

బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగే రెండువిడతల లోక్‌సభ ఎన్నిలకు సంబంధించి శుక్రవారం నుంచి ఎన్నికల సర్వేలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 14 నియోజకవర్గాలకు తొలివిడత పోలింగ్ ఈనెల 26న జరుగనుండగా రెండోవిడత మే నెల 7న ఓటింగ్ ఉంటుంది. రెండోవిడతకు సంబంధించి శుక్రవారంతో నామినేషన్‌ల దాఖలు గడువు ముగుస్తుంది. ఈనెల 19 నుంచి జూన్‌నెల 1వ తేదీ సాయంత్రం దాకా వరకూ రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి ఎటువంటి సర్వేలు ప్రకటించరాదని ఆదేశాలు జారీ చేశారు.





హస్తవ్యస్తం..!

● ఎన్నికలు ముంచుకొస్తున్నా కాంగ్రెస్‌లో ఊపందుకోని ప్రచారం ● మైసూరు దాటని సిద్దరామయ్య ● తమ్ముడి గెలుపుపైనే డీకే దృష్టి..
● జాడ లేని అగ్రనేతలు ● ఎన్నికల్లో ఓడితే సిద్దరామయ్యకు సీఎం పదవి హుళక్కే.. ● మంత్రి బైరతి సురేశ్ వ్యాఖ్యలపై కలకలం

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ వెనకపడింది. పార్టీకి జంట గుర్రాలాంటి సీఎం, డీసీఎం నియోజకవర్గాలపై దృష్టి సారించడం లేదు. ఏడాదిక్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో 135 స్థానాల్లో గెలుపొందిన కాంగ్రెస్ శక్తివంతమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంది. పాలన ప్రారంభం కాగానే ఎన్నికల హామీ గ్యారెంటీలను అమలు చేసింది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు ముంచుకొచ్చినా కాంగ్రెస్ అగ్రనేతలు రాష్ట్రమంతా పర్యటించడం లేదనే విమర్శలు ఎదురవుతున్నాయి. 28 లోక్‌సభ స్థానాలపైకి బెంగళూరు నుంచి మంగళూరు దాకా 14 నియోజకవర్గాలకు ఈనెల 26న పోలింగ్ జరగనుంది. పోలింగ్‌కు మరోవారం రోజులుమాత్రమే గడువుంది. అయితే 14 నియోజకవర్గాల్లోనూ సీఎం సిద్దరామయ్య పర్యటించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం సిద్దరామయ్య సొంత జిల్లా మైసూరును ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. మైసూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా రాజకుటుంబానికి చెందిన యువరాజు యదువీర్ పోటీ చేస్తుండడంతో సీఎం సిద్దరామయ్యకు ఇదో చాలెంజ్ అయ్యింది. ఇక చామరాజనగర స్థానం నుంచి ఆప్తమిత్రుడు, మంత్రి మహదేవప్ప కుమారుడు సునిల్‌బోస్‌కు టిక్కెట్ దక్కించుకున్నారు. అక్కడ గెలుపు సాధించాలనే తపనతో ఉన్నారు. ఇక మండ్యలో జేడీఎస్ నేత కుమారస్వామి బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీమంతుడు స్టార్ చంద్రు బరిలో ఉన్నారు. ఈమూడు నియోజకవర్గాలపై సీఎం సిద్దరామయ్య ఎక్కువ దృష్టి సారించారు. ఇటీవల రెండువారాల వ్యవధిలో సీఎం దాదాపు ఐదారు రోజులకుపైగా మైసూరు ప్రాంతంలోనే గడిపారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న వరుణలో ఎన్నికల ప్రచార వేళ 60వేల మెజారిటీ



సాధిస్తే నా నాయకత్వం శక్తివంతం అవుతుందని సందేశమిచ్చారు. కాగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేది లేదని తేల్చి చెప్పారు. మైసూరుకు వెళ్తే అక్కడే రెండు మూడు రోజులు గడుపుతున్నారు. మంగళూరు, కోలారు జిల్లాకు ఓసారి వెళ్లారు. తాజాగా గురువారం చిక్కబళ్లాపుర అభ్యర్థి రక్షా రామయ్య తరపున చిక్కబళ్లాపుర, గౌరిబిదనూరు, బాగేపల్లిలో ప్రచార సభల్లో పాల్గొన్నారు. శుక్రవారం సీఎం హాసన్‌కు వెళ్తున్నారు. తొలి విడత 14 నియోజకవర్గాల్లో నామినేషన్లు వేసే రోజున మైసూరు, చామరాజనగర, బెంగళూరు అభ్యర్థులతోపాటు రోడ్‌షోలలో పాల్గొన్నారు. ఉత్తరకర్ణాటక జిల్లాల పరిధిలోని 14 నియోజకవర్గాల్లో నామినేషన్లకు దూరందూరంగానే గడిపారు. రెండోవిడత జరిగే 14 నియోజకవర్గాలకు శుక్రవారంతో నామినేషన్ల ప్రక్రి య ముగుస్తుంది.



● డీసీఎం డీకే శివకుమార్‌కు మరో ప్రతిష్టాత్మకత వెంటాడుతోంది. తమ్ముడు డీకే సురేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న బెంగళూరు గ్రామీణపై ప్రత్యేక దృష్టి సారించారు. బెంగళూరు గ్రామీణ పరిధిలో పార్టీలోకి చేరికలు, సమావేశాలు, సౌలభ్యాల విషయంలో ప్రత్యేకంగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన నియోజకవర్గాల పట్ల తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇక డీకే శివకుమార్‌కు కంటిమీద కునుకు లేకుండా జేడీఎస్ నేతలు కుమారస్వామి, దేవెగౌడలు చేస్తున్నారు. రోజుకో అంశాన్ని తెరపైకి తీసుకు వస్తున్నారు. దీంతో డీకే శివకుమార్ మండ్యలో కుమారస్వామిని దెబ్బతీయడం చాలెంజ్‌గా భావిస్తున్నారు. జేడీఎస్‌పై సంచలన ప్రకటనలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత జేడీఎస్ ఉండదని, పార్టీ ఒక్కసీటు కూడా గెలవదని, మండ్యలో కుమారస్వామి ఓటమి తప్పదని సవాల్ చేస్తున్నారు. ఉత్తరకర్ణాటక పరిధిలో కలబురగి, బెళగావి అభ్యర్థుల నామినేషన్లకు మాత్రమే డీకే శివకుమార్ హాజరయ్యారు. మిగిలిన అభ్యర్థుల నామినేషన్లు స్థానిక నేతలతోనే కొనసాగాయి. ఇప్పటి దాకా జాతీయస్థాయి నేతలు ప్రచారానికి హాజరు కాలేదు. కేవలం రాహుల్‌గాంధీ మాత్రమే బుధవారం మండ్య, కోలారులలో ప్రచారసభల్లో పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న వ్యాఖ్యలు

లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో సంచలనాలు తప్పవనే సంకేతాలు జోరందుకున్నాయి. ప్రతిపక్ష బీజేపీకి చెందిన బసనగౌడ పాటిల్ యత్నాళ్ లోక్‌సభ ఎన్నికల తర్వాత సీఎం మార్పు జరగనుందని డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారని ప్రకటించారు. ఎన్నికల వేళ బీజేపీ ప్రత్యర్థి కావడంతో ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటారని అందరూ భావించారు. అయితే సొంత పార్టీలోనూ ఇటువంటి అంశాలపై ప్రస్తావనలు గందరగోళానికి కారణమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికలు సిద్దూకు కీలకం కానున్నాయి.

కాంగ్రెస్ అభ్యర్థులు ఓడితే సీఎంకు ఇబ్బందులే..

● మంత్రి బైరతి సురేశ్



లోక్‌సభ ఎన్నికల ప్రచారం జోరందుకున్న వేళ విమర్శలతోపాటు సొంత పార్టీపై నమ్మకం కోల్పోయేలాంటి వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. కోలారులో గురువారం కురుబ సామాజికవర్గ ముఖ్యుల సభలో మంత్రి బైరతి సురేశ్ మాట్లాడుతూ మన పార్టీ అభ్యర్థులు ఓడితే సీఎం సిద్దరామయ్య సీటుకు ఇబ్బందికరమని మీరు అలాంటి పరిస్థితి తేరాదని, చేతులు జోడించి వేడుకుంటున్నా అన్నారు. కురుబ సామాజికవర్గమంతా సిద్దరామయ్యను బలపరచాలని కోరారు. మీ బలం కాంగ్రెస్‌కు, సిద్దరామయ్యకు తోడు కావాలన్నారు. సిద్దరామయ్య సీటుకు ఇబ్బందికరమైతే మీరే బాధ్యులు అవుతారని అభిప్రాయపడ్డారు. అనంతరం మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా కోలారు సభలో రాహుల్‌గాంధీ, డీకే శివకుమార్‌ను పొరపాటున సీఎంగా ప్రస్తావించారని, అటువంటి తప్పిదాలు అగ్ర నాయకులంతా చేశారన్నారు.



ఎన్నికల తర్వాత సీఎంగా డీకే శివకుమార్

● ఐదు గ్యారెంటీల్లో సీఎం మార్పు కూడా గ్యారెంటే..
● బీజేపీ నేత యత్నాళ్

బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ అయ్యేందుకు తగిన ప్రక్రియ సాగుతోందని, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన 15రోజులలోనే సీఎం మార్పు తథ్యమని బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌యత్నాళ్ అభిప్రాయపడ్డారు. గురువారం విజయపురలో ఆయన మీడియాతో మాట్లాడుతూ డీకే శివకుమార్ సీఎం అయ్యేందుకు పలు ప్రణాళికలు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో సీఎం మార్పు జరిగితే డీకే శివకుమార్‌దే స్థానమన్నారు. అయితే ఆవెంటనే రాజకీయ కల్లోలం జరిగి ప్రభుత్వం పతనం కానుందన్నారు. బాగల్‌కోటెలో మంత్రి శివానందపాటిల్ కుమార్తె సంయుక్తా పాటిల్‌ను గెలిపించాలని డీకే శివకుమార్ కోరారన్నారు. తనతో కలిసి శివానందపాటిల్ సీఎం సిద్దరామయ్యను గద్దె దించేందుకు ప్రయత్నిస్తారని సందేశమిచ్చారన్నారు. సిద్దరామయ్యను సీఎం పదవి నుంచి దించితే ప్రభుత్వం పతనమవుతుందన్నారు. ఐదు గ్యారెంటీలలో సిద్దరామయ్య పదవి పోవడం కూడా ఒక గ్యారెంటీనే అంటూ ఎద్దేవా చేశారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రత్యామ్నాయ నేత లేరన్నారు. అందుకే పోలింగ్‌శాతం పెంచడం ద్వారా నరేంద్రమోదీకి సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. మోదీ ఉంటేనే సనాతన ధర్మం ఉంటుందని కులాలు ఉంటాయన్నారు. సత్తా ఉంటే మంత్రి శివానంద పాటిల్ తనపై పోటీ చేయాలని సవాల్ విసిరారు.

90మంది అభ్యర్థులు.. 104 నామినేషన్లు

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ రెండో విడత 14 నియోజకవర్గాల్లో నామినేషన్ల దాఖలుకు మరో రోజు మాత్రమే గడువు ఉండడంతో పోటా పోటీగా దాఖలు చేశారు. గురువారం 90మంది అభ్యర్థులు 104 నామినేషన్లు, వీరిలో 83మంది పురుషులు 93 నామినేషన్లు వేయగా, ఏడుగురు మహిళలు 11 నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు 241మంది నామినేషన్లు దాఖలు చేసినట్టయ్యింది. వీరిలో 221మంది పురుషులు కాగా 20మంది మహిళలు ఉన్నారు. సురపుర శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్ ఒకరు నామినేషన్ వేశారు.



ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

అలక వీడని అనంత..

● టిక్కెట్ దక్కకపోవడంపై అనంత్‌కుమార్ హెగ్డే సీరియస్
● అమిత్‌షా ఫోన్ చేసినా నో రెస్పాన్స్.. ● ఫైర్‌బ్రాండ్ మౌనంపై కార్యకర్తల్లో ఆందోళన



బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ లోక్‌సభ సభ్యుడు, హిందూత్వ ఫైర్ బ్రాండ్‌గా పేరొందిన అనంతకుమార్ హెగ్డే పార్టీ అగ్రనేతలను సైతం పట్టించుకునే పరిస్థితిలో లేరు. ఉత్తరకన్నడ నుంచి 6 సార్లు గెలుపొందిన అనంతకుమార్ హెగ్డే ప్రస్తుత ఎన్నికల్లోనూ టిక్కెట్ ఆశించారు. అధిష్ఠానం ఇవ్వకపోవడంతో తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వ్యతిరేకంగా ఉండడం సరికాదని పార్టీ అధిష్ఠానం భావించింది. నేరుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస అగర్వాల్‌తోపాటు ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యులు ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినా ఆయన స్పందించడం లేదు. ఎవరి ఫోన్‌లు రిసీవ్ చేయకుండా సైలెంట్‌గా ఉన్నారు. మరోసారి టిక్కెట్ దక్కుతుందని భావించిన అనంతకుమార్ హెగ్డే డిసెంబరు నుంచి మార్చి దాకా నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించారు. మళ్ళీ పోటీ చేస్తానని చెప్పుకొచ్చారు. అయితే ఉత్తరకన్నడకు చెందిన మాజీ స్పీకర్ విశ్వేశ్వరహెగ్డే కాగేరికి టిక్కెట్ కేటాయించడంతో అనంతకుమార్ హెగ్డే ఖంగు తిన్నారు. ఆయనను బుజ్జగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఉత్తరకన్నడ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్ హరతాళు హాళప్ప, అనంతకుమార్ హెగ్డేతో చర్చలు జరిపినా ఫలించలేదు. అభ్యర్థి కాగేరి మర్యాదపూర్వకంగా వెళ్లగా వాపసు పంపిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అనంతకుమార్ హెగ్డే ఎవరికి అందుబాటులోకి లేరు. 'తాయినెలద సేవలో' అనే శీర్షికతో పుస్తకం రాసేందుకు సిద్ధమైనట్లు ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు. జీవితంలో ఎదురైన రాజకీయ, సామాజిక అంశాలను పుస్తకంలో పొందుపరుస్తున్నారు. రోజుకో పేజీని ఫేస్‌బుక్ ద్వారా ప్రకటిస్తున్నారు.

అవినీతి పాలన ఆయన సొంతం

● మాజీ మంత్రి సుధాకర్‌పై సీఎం సిద్దరామయ్య ధ్వజం

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొవిడ్ వేళ కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన మాజీ మంత్రి, ప్రస్తుత బీజేపీ అభ్యర్థి డాక్టర్ సుధాకర్‌కు ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. చిక్కబళ్లాపుర, దొడ్డబళ్లాపుర, గౌరిబిదనూరు, బాగేపల్లిలలో గురువారం సీఎం రోడ్‌షో, బహిరంగ సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి రక్షా రామయ్య తరఫున ప్రచారం చేశారు. సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ పదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ రైతులు, కార్మికులు, యువతకు, మహిళలకు, శ్రామికవర్గానికి ఒక కార్యక్రమాన్ని కూడా ఎందుకు రూపొందించలేదని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో విఫలం, రూపాయి ధర పడిపోవడం, రైతుల ఆదాయం తగ్గడం, నిరుద్యోగం పెరగడం ప్రధాని మోదీ సాధన అని వ్యంగ్యం చేశారు. ఏడాదికి కోట్ల ఉద్యోగాలు, విదేశాలనుంచి నల్లధనం వాపసు తెస్తామన్న ప్రధాని మోదీ ఇంతవరకు అమలు కాలేదన్నారు. బీజేపీ వారైనా మోదీ అయినా ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు చేయలేదని ఆరోపించారు. బీజేపీలో మంత్రిగా అక్రమాల కారణంగానే శాసనసభ ఎన్నికల్లో సుధాకర్‌ను ప్రజలు ఓడించారన్నారు. అయితే శాసనసభ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. రోడ్‌షోలో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



ధారవాడ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న దింగాలేశ్వర స్వామి

ఎన్నికల్లో పోటీకి దింగాలేశ్వరస్వామి సై

● ప్రహ్లాదజోషికి వ్యతిరేకంగా ధారవాడలో నామినేషన్

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ధారవాడ నియోజకవర్గంలో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి వ్యతిరేకంగా పోటీ చేస్తానని ప్రకటించిన దింగాలేశ్వరస్వామి గురువారం ఎట్టకేలకు నామినేషన్ దాఖలు చేశారు. ధారవాడ కలెక్టరేట్‌కు భక్తులు, అనుచరులతో కలసి నామినేషన్ వేశారు. దింగాలేశ్వరస్వామి నామినేషన్‌తో ధారవాడ ఎన్నిక ఉత్కంఠగా మారింది. కాంగ్రెస్ నుంచి ఆనంద్ అసోటిక పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల మధ్యనే పోటీ ఉంటుందని తొలుత భావించారు. గత కొన్నేళ్లుగా లింగాయత సమాజానికి కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి అడ్డంకులు వేశారనే కారణంతో దింగాలేశ్వరస్వామి పోటీ చేస్తానని మూడు నెలలక్రితం ప్రకటించారు. బీజేపీ వర్గాలు ఆయనను రాజీ చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశాయి. ఆయన పోటీ మినహా మరో ఆలోచన లేదని తేల్చి చెప్పడంతో ఇక్కడ రాజకీయం మలుపులు తిరుగుతోంది. 6.5 లక్షలమందికిపైగా వీరశైవలింగాయత ఓటర్లు ఉన్నారు. వారు విజయానికి నిర్ణయాత్మకం అవుతారు. స్వామిజీకి నియోజకవర్గ వ్యాప్తంగా అపారమైన భక్తులు ఉన్నారు. ఈ ప్రాంతంలోని పలువురు స్వామిజీలు కూడా దింగాలేశ్వరస్వామికి మద్దతు ఇస్తున్నారు. అన్నీ కలసి వస్తే జోషి ఎన్నికల్లో మరింత కష్టపడాల్సి ఉంది.

దింగాలేశ్వరస్వామి ఆస్తుల వివరాలు

గదగ్ జిల్లా శిరహట్టి ఫకీరేశ్వరమఠం దింగాలేశ్వరస్వామీజీ ధారవాడ లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నామినేషన్‌లో రూ.9.74కోట్ల ఆస్తులు ఉన్నట్టు పేర్కొన్నారు. రూ.8.52 కోట్ల స్థిరాస్తి ఉండగా రూ..1.22 కోట్ల చరాస్తులు ఉన్నాయని, పలు చోట్ల రూ.36.98 లక్షల అప్పులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

అన్ని స్థానాల్లో బీజేపీదే విజయం

● రాఘవేంద్రకు 3 లక్షల మెజారిటీ ఖాయం : మాజీ సీఎం యడియూరప్ప

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ - జేడీఎస్ కూటమి అభ్యర్థులు గెలుపు సాధిస్తారని మాజీ సీఎం యడియూరప్ప విశ్వాసం వ్యక్తం చేశారు. శివమొగ్గలో గురువారం బీజేపీ అభ్యర్థి రాఘవేంద్ర నామినేషన్ దాఖలు చేశారు. భారీ ర్యాలీగా తరలివెళ్లి నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా యడియూరప్ప మాట్లాడుతూ రాఘవేంద్ర మరోసారి ఎంపీ అవుతారని, 3 లక్షలకుపైగా మెజారిటీ సాధిస్తారన్న ధీమా వ్యక్తం చేశారు. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు దుష్టశక్తులు ఒక్కటయ్యాయని, కాంగ్రెస్ గ్యారెంటీలతో అభివృద్ధిని మరిచిందన్నారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సినంత స్థానాల్లో పోటీ చేయలేదన్నారు. 35 మార్కుల కోసం ప్రయత్నించే కాంగ్రెస్‌కు అధికారం సాధ్యమా అన్నారు. కొవిడ్ వంటి క్లిష్ట కాలంలో 130 కోట్ల మంది ప్రజలు ప్రధాని మోదీ పట్ల విశ్వాసం వ్యక్తం చేశారన్నారు. రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.75 లక్షలప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కిసాన్‌సమ్మాన్‌లో భాగంగా రైతులకు ఇస్తున్న 4వేల రూపాయలను కాంగ్రెస్ పాలన రాగానే రద్దు చేశారన్నారు. సీటీ రవి మాట్లాడుతూ విధానసౌధలో పాకిస్తాన్ జిందాబాద్ అని నినాదాలు చేశారని అందరిలో హనుమాన్ చాలీసా వేస్తే వ్యతిరేకిస్తారన్నారు. శ్రీరామనవమి రోజున జై శ్రీరామ్ అన్నందుకే దాడి చేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇలాగే ఉంటుందన్నారు. అభ్యర్థి రాఘవేంద్ర మాట్లాడుతూ చేసిన అభివృద్ధిని చూపుతూ ఓట్లు అడుగుతున్నామన్నారు.



శివమొగ్గలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి రాఘవేంద్ర

సీఈటీలో తప్పులుంటే బోర్డుకు తెలపండి

● సీఈఓ రమ్య



బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఈటీ పరీక్షల్లో పాఠ్యాంశాల్లో లేని ప్రశ్నలు ఉంటే కీ నోట్ విడుదలయ్యాక అభ్యంతరాలు తెలపాలని పరీక్షా ప్రాధికార సీఈఓ రమ్య తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం 2023-24 సంవత్సరానికి సంబంధించి సీఈ టీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజున బయాలజీ సబ్జెక్టులో 10 ప్రశ్నలు పాఠ్యాంశాల్లో లేనివి రావడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. పరీక్షలు ముగిశాక పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షా ప్రాధికార కార్యాలయానికి తరలివచ్చారు. అవుట్ ఆఫ్ సిలబస్ ఇస్తే ఎలా..? రాయాలని ప్రశ్నించారు. ఈమేరకు కీ విడుదలయ్యాక అభ్యంతరాలు తెలపాలని, ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోలేమని అధికారులు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 3.75 లక్షలమంది సీఈటీ నమోదు చేసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే లక్ష మంది అధికంగా పరీక్షలు రాశారు.

రాజకీయ వ్యూహంతోనే...

బరిలోకి మంజునాథ్

● జేడీఎస్ నేత.. మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి



బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ-జేడీఎస్ మైత్రిగా ఉందని రాజకీయ వ్యూహంతోనే డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను బరిలోకి దింపామని జేడీఎస్ నేత కుమారస్వామి తెలిపారు. శివమొగ్గకు వెళ్లే ముందు గురువారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ రాజకీయ వ్యూహం ఫలించాలనే తానే మంజునాథ్‌ను బీజేపీ నుంచి పోటీ చేయించానన్నారు. బెంగళూరు గ్రామీణలో మంజునాథ్ విజయం ఖాయమని, అక్కడి ప్రజలకు మంజునాథ్‌పై విశ్వాసం ఉందన్నారు. ఆరోగ్య రంగంలో ఆయన సేవలను ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. ఆయన సేవాభావాలే ఆయన్ని గెలిపిస్తాయన్నారు. ఎందరో పేదలకు ఆయన అందించిన వైద్య సేవలను ఎల్లప్పుడూ ప్రజలు మరవలేరన్నారు. కాంగ్రెస్ నేతలవి లేనిపోని ఆరోపణలన్నారు. కూటమి విజయాన్ని ఎవ్వరూ ఆపలేరన్నారు. దేవెగౌడ అల్లుడు అయినా రాజకీయాల్లోకి రావాలని లేదని, కానీ రాజకీయ వ్యూహం కోసం బరిలోకి నిలిపానన్నారు.

ఆ రెండు రోజులు నిద్రపోను : నిఖిల్

రాష్ట్రంలో బీజేపీ ప్రకంపనలు కొన సాగుతున్నాయని, అయితే డీకే సోదరులు రెండు గంటల్లో మార్చగలరని అందుకే చివరి రెండు రోజులు నిద్రపోయేది లేదని జేడీఎస్ యువనేత నిఖిల్ కుమారస్వామి తెలిపారు. రాత్రి 2 నుంచి 4వరకు భారీగా పంపిణీలకు సిద్ధమయ్యారని ఆ రెండు గంటలు తనకు కీలకమన్నారు. పంపిణీలకు ఎక్కడా అవకాశం ఇవ్వబోమన్నారు. ఎన్నికల్లో వారి ఓటమి ఖచ్చితమన్నారు. ఎన్నికల వేళ కొందరు పార్టీ మారడం సహజమని, మరికొందరు వస్తుంటారన్నారు. బీజేపీ - జేడీఎస్ మైత్రి శక్తివంతమైనదని కార్యకర్తలు కలసి పరస్పరం చేస్తున్నారన్నారు. ఓటర్లు ఇప్పటికే కాంగ్రెస్‌ను ఓటమిని నిర్ణయించారన్నారు.



ఉపాధి కూలీలతో ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు

మామ కోసం అల్లుడి ప్రచారం

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి శ్రీరాములు గెలుపు కోసం అల్లుడు మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు కంప్లి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. హడ్లిగి, బసరకోడు, ఛానాల్, కొర్లగుంది, కగ్గల్లు, దమ్మూరు, తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ వలన ఇంతవరకు ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. అలాగే మోదీ ప్రజలకు, రైతులకు, కూలీలకు ఎన్నో అభివృద్ధి పథకాలు అందించారన్నారు. బీజేపీ ఎంపీగా శ్రీరాములు వున్న సమయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అలాగే ఈ ఎన్నికల్లో కూడా వారి అమూల్యమైన ఓటు తమ నాయకుడు శ్రీరాములుకు వేసి గెలిపిస్తే జిల్లా పూర్తిగా అభివృద్ధి బాటలో కొనసాగుతుందని తెలిపారు. - కంప్లి

తండ్రి కోసం తనయ..

కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారామ్ గెలుపు కోసం ఆయన కుమార్తె చైతన్య సండూరు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేపట్టింది. బుధవారం కుడితినిలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో వాడవాడలా ప్రచారం చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ తండ్రి నాలుగు సార్లుగా తమ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేపట్టారని పేర్కొంది. అలాగే పెద్ద నాయకుల ఆదేశాల మేరకు ఈ పోటీలో లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేస్తున్నారని, అలాగే ఎంపీ అభ్యర్థిగా గెలుపొందినట్లయితే పూర్తిగా జిల్లా అభివృద్ధి చేపట్టి ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతారన్నారు. బీజేపీ హయాంలో ఇంతవరకు అభివృద్ధి శూన్యమని, కేవలం కాంగ్రెస్ నాయకులు ఎంపీలుగా వున్న సమయంలోనే జిల్లా అభివృద్ధి చెందిందన్నారు. ఈ ఎన్నికల్లో వారి ఓటును తమ తండ్రికి వేసి గెలిపిస్తే ఐదేళ్ల పాటు తమకు అండగా వుంటూ సమస్యలను పరిష్కరిస్తూ ఉత్తమ నాయకుడిగా నిలుస్తారన్నారు. కుడితిని పట్టణంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, బైపాస్ రోడ్డు తదితరాలను డీఎంఎఫ్ నిధులతో పూర్తిగా అభివృద్ధి చేస్తారన్నారు. కావున ఈ ఎన్నికల్లో తుకారాంను ఎన్నుకుని గెలిపించాలని కోరారు. వారితో పాటు మాజీ పట్టణ పంచాయతీ అధ్యక్షులు వి రాజశేఖర్, చంద్రప్ప, ఆశాలత, విజయలక్ష్మీ, కౌన్సిలర్లు కనికేరి పంపాపతి, లెనిన్, అంజి, శెట్టప్ప, గంగాధర్, మల్లి, వెంకటరమణ బాబు, చంద్రయ్య దొడ్డ బసప్ప, మహిళలు పాల్గొన్నారు. - కంప్లి



తుకారామ్ గెలుపు కోసం ప్రచారం చేపడుతున్న కుమార్తె చైతన్య



● ప్రచారంలో కనిపించని మాజీనేతలు

ఔనా..! వారేమయ్యారు..?

బళ్లారి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. అయితే ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మాజీ రాజకీయ నాయకుల సందడి మాత్రం పెద్దగా కనిపించడం లేదు. ఇప్పటి వరకు ఎంపీలుగా గెలిచిన నాయకులు ఈ ఎన్నికల్లో ఎక్కడా కనిపించడంలేదు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి గెలిచి మాజీలుగా మారిన ఎంపీలు ఈసారి ఎన్నికల్లో చుట్టపు చూపుగా అయినా ప్రచారానికి రాలేదు. కాంగ్రెస్ పార్టీ నుంచి సోనియా గాంధీ, కేసీ కొండయ్య, ఉగ్రప్ప లాంటి నాయకులు బళ్లారిలో ఎంపీలుగా గెలిచారు. బీజేపీ నుంచి కరుణాకర్ రెడ్డి, జే. శాంత, ప్రస్తుత ఎంపీ దేవేంద్ర విజయం సాధించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎంపీ ఉగ్రప్ప బళ్లారి ఎంపీ టికెట్ ఆశించారు. ఆయనతో పాటు మంత్రి బి. నాగేంద్ర సోదరుడు ప్రసాద్ కూడా టికెట్ కోసం గట్టిగా ప్రయత్నం చేశారు. ఇక బీజేపీ నుండి ప్రస్తుత ఎంపీ దేవేంద్రప్ప తనకే టికెట్ వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం కొత్త ఎత్తు వేసింది. సండూరు ఎమ్మెల్యేగా ఉన్న ఈ. తుకారాంను రంగంలోకి దించింది. ఇక బీజేపీ కూడా ప్రస్తుత ఎంపీ దేవేంద్రప్పను పక్కకు పెట్టి బి.శ్రీరాములుకు టికెట్ ఇచ్చింది.

● బళ్లారి ఎంపీ స్థానానికి ఒక ప్రత్యేకత ఉంది. 1951 నుండి 1999 వరకూ కాంగ్రెస్ పార్టీ ఎంపీలే ఇక్కడ గెలుస్తూ వచ్చారు. 2004లో బీజేపీ ఎంపీగా గాలి కరుణా కరుణాకర్‌రెడ్డి బోణీ కొట్టాడు. 2009లో జే.శాంత, 2014లో బి, రాములు, 2018లో జరిగిన ఉప ఎన్నికల్లో ఉగ్రప్ప గెలిచారు. 2019 జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఎంపీ దేవేంద్రప్ప గెలిచారు. బీజేపీకి ఇంతమంది మాజీలు ఉన్నా ఇప్పటి వరకూ వీరెవరూ ప్రచారంలో పాల్గొనలేదు, అలాగే కాంగ్రెస్ మాజీ ఎంపీలు కూడా ప్రచార రథం ఎక్కలేదు.

● బీజేపీలో జే. శాంత కర్ణాటక రాజకీయాలను వదిలి ఏకంగా ఏపీ రాజకీయాల్లోకి వెళ్లి అక్కడ వైఎస్సార్‌సీపీ పార్టీ హిందూపురం లోక్‌సభ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. ఇక దేవేంద్రప్ప టికెట్ తనకు దక్కలేదనే కసితో ఇంత వరకూ ప్రచారంలోకి అడుగుకూడా పెట్టలేదు. కాంగ్రెస్ మాజీ ఎంపీ ఉగ్రప్ప నామినేషన్ రోజు వస్తారని పార్టీ వర్గాలు భావించాయి. కానీ ఆయన అసంతృప్తితో రాకుండా పోయారని సమాచారం, ఇక సోనియా గాంధీ ఏమైనా ప్రచారానికి వస్తారా? అంటే అనుమానమే. దీనిపై పార్టీవర్గాలు స్పష్టం చేయడం లేదు, కేసీ కొండయ్య ఆనారోగ్యం, వయోభారం కారణంగా పెద్దగా బయట తిరగలేని పరిస్థితుల్లో ఉన్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ ప్రస్తుత లోక్‌సభ పోటీలో ఉండే అభ్యర్థులు ఊరూరా ప్రచారం జోరుగా చేస్తుంటే ఆ మాజీ ఎంపీలు మాత్రం ఎవరూ కనపించట్లేదేమిటి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



దేవేంద్రప్ప



గాలి కరుణాకర్‌రెడ్డి



ఉగ్రప్ప



సోనియా గాంధీ



జె. శాంత





ఎమ్మిగనూరులో ఎద్దుల బండ్లపై ఓటు హక్కు ర్యాలీని ప్రారంభిస్తున్న ఈఓ శ్రీకుమార్

అమూల్యమైన ఓటు..అశ్రద్ధ వద్దు..

కంప్లి, ఏప్రిల్ 18: ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనది..దానిని అశ్రద్ధ చేయవద్దని అధికారులు సూచించారు. గురువారం ఎమ్మిగనూరు గ్రామంలో లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో ఎద్దులబండ్లపై అవగాహనను శతమాన పాఠశాల నుంచి నోడల్ అధికారి శ్రీకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పలు గ్రామాల్లో ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు శారద, ఉపాధ్యక్షురాలు గాదెలింగప్ప, మల్లన్నగౌడ, తారానాయక్, అనుమేష్, బసన్నగౌడ, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కుడితిని పట్టణంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కాగడాలతో పట్టణ పంచాయతీ సిబ్బంది, సంఘ సంస్థ నేతలు స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో వాడవాడలా ర్యాలీ నిర్వహించారు.



కరడి..గారడి..!

● తొమ్మిదో సారి పార్టీ మారిన కరడి సంగణ్ణ ● టిక్కెట్ దక్కకపోవడంతో తాజాగా కాంగ్రెస్‌లోకి..



బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకులు నైతికత గురించి పదవుల్లో ఉన్నప్పుడు మాత్రమే మాట్లాడుతారు. వారికి ఏమాత్రం ఇబ్బంది కలిగినా పార్టీకి గుడ్‌బై చెప్పి మరో రాజకీయ పార్టీలోకి జంప్ చేస్తుంటారు. పార్టీలు మారడంలో కొన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కొప్పళ బీజేపీ ఎంపీ కరడి సంగణ్ణ ఇటీవల బీజేపీకి గుడ్‌బై చెప్పారు. ఎంపీ పదవితో పాటు బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆయన మరోసారి కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. కొప్పళ నుంచి ఆయన రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు. ఇప్పటి దాకా కరడిసంగణ్ణ ఏకంగా తొమ్మిదిసార్లు పార్టీ ఫిరాయించారు. 1978లో తాలూకా అభివృద్ధి మండలికి కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. 1983లో జనతా పార్టీ నుంచి జిల్లాపరిషత్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1994లో ఇండిపెండెంట్‌గా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999లో జేడీయూలో చేరారు. 2004 ఎన్నికల వేళ బీజేపీలో చేరారు. 2008లో జేడీఎస్‌లోకి జంప్ చేసి ఎమ్మెల్యే అయ్యారు. 2011లో జేడీఎస్‌కు రాజీనామా చేశారు. ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి విజయం సాధించారు. 2013లో ఎన్నికలలో బీజేపీ నుంచి ఓటమి చెందారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ నుంచి విజయం సాధించారు. అయితే కొప్పళ నియోజకవర్గాన్ని వదులుకోకుండా 2018 ఎన్నికలలో కుమారుడు అమరేష్ కరడికి టికెట్‌లు సాధించి పెట్టారు. ఇలా పార్టీ ఏదైనా నాలుగున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు.

అదే బాటలో అఖండ శ్రీనివాస్..

ఇక బెంగళూరు పులకేశినగర్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే అఖండ శ్రీనివాసమూర్తి బీజేపీలో చేరారు. ఆయన సుదీర్ఘ కాలం పాటు జేడీఎస్‌లో ఉన్నారు. అక్కడి నుంచే ఎమ్మెల్యేగా గెలుపు సాధించారు. ఆతర్వాత రాజ్యసభ ఎన్నికలలో విప్‌ను ఉల్లంఘించి కాంగ్రెస్‌కు ఓటు వేశారు. దీంతో జేడీఎస్ నేతలు ఆయనను పక్కన పెట్టారు. ఆతర్వాత 2018 ఎన్నికలలో కాంగ్రెస్ నుంచి గెలుపు సాధించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే స్థానికంగా జరిగిన గొడవల కారణంగా ఆయన ఇంటిపై దాడి జరిగింది. ఏకంగా ఇంటికి నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. అఖండకు ఇటీవల శాసనసభ ఎన్నికలలో టికెట్ ఇచ్చే విషయమై సీఎం సిద్ధరామయ్య సుముఖంగా ఉన్నా డీసీఎం, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు డీకే శివకుమార్ అంగీకరించికపోవడంతో సాధ్యం కాలేదు. టికెట్ రానందున బీఎస్పీ తరుపున పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం బీజేపీలో చేరారు.

వేడెక్కిన రాజకీయం

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

- ఆర్భాటంగా దాఖలుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
- ప్రచారంలో మరింత కూటమి అభ్యర్థుల దూకుడు
- హామీలు నెరవేర్చలేని వైసీపీలో ఓటమి భయం
- ఓటమి భయంతో వైసీపీ కవ్వింపు చర్యలకు శ్రీకారం
- కూటమి శ్రేణులను అప్రమత్తమం చేస్తున్న ముఖ్యనేతలు
- అధికారుల పనితీరుపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా

అనంతపురం ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లాలో రాజకీయం మరింతగా వేడెక్కింది. తొలి రోజే నామినేషన్ల ప్రక్రియకు పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రీకారం చుట్టారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్యనాయకులతో కలిసి కూటమి అభ్యర్థులు, అధికార వైసీపీ అభ్యర్థుల తరపున తొలి రోజు ఒకటి, రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఒకరిద్దరు అభ్యర్థులు స్వయంగా నామినేషన్లు దాఖలు చేశారు. పార్లమెంట్ అభ్యర్థులదీ ఇదే పరిస్థితి. కాగా భారీ జన సమీకరణతో ఆర్భాటంగా నామినేషన్ దాఖలు చేయడానికి అధికార, ప్రతిపక్ష పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. నామినేషన్ సమయంలోనే బలాన్ని చూపించుకునేందుకు అభ్యర్థులు సమాయత్తమవుతున్నారు.

గెలుపే లక్ష్యంగా వ్యూహరచన

గెలుపే లక్ష్యంగా జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు వ్యూహ రచన చేస్తున్నారు. విజయానికి తోడ్పడే అన్ని అవకాశాలను అందిపుచ్చుకునేలా కార్యాచరణను రూపొందించుకుంటున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, యువత, మహిళలు, రైతులు, కార్మికుల్లో చైతన్యం నింపే దిశగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అధికార వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏ వర్గానికి న్యాయం చేయలేదన్న విషయాన్ని ప్రజలకు బలంగా వివరిస్తున్నారు. కూటమికి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామనే భరోసాను ఇస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గరపడేకొద్దీ ప్రచారంలో మరింత దూకుడు పెంచాలనే యోచనలో కూటమి అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్‌కు మూడు వారాల గడువు ఉన్న నేపథ్యంలో... కూటమి నాయకులు, కుటుంబ సభ్యులు, అభ్యర్థులు, తలా ఓ ప్రాంతంలో ఇంటింటి ప్రచారం చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు. బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు.

మాటలే.. చేతలు లేవు

రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమిదే అధికారమని సర్వేలన్నీ స్పష్టం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని అధికార వైసీపీ అభ్యర్థుల్లో గుబులు రేగుతోంది. జిల్లాలోనూ అధికార వైసీపీకి 2 నుంచి 3 స్థానాల కంటే ఎక్కువ సీట్లు రావని సర్వేలు తేలుస్తున్న క్రమంలో ఆ పార్టీ అభ్యర్థులను ఓటమి భయం వెంటాడుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో బటన్ నొక్కుడు తప్పా ఏ ఒక్క అభివృద్ధి పనులు చేయకపోగా... ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ జిల్లాకు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. ఇక స్థానికంగా గత ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ అభ్యర్థులు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారు. ఉదాహరణకు అనంతపురం అర్బన్‌లో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని సిట్టింగ్ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఐదేళ్ల పాలన ముగుస్తున్నా... ఆ హామీ నెరవేర్చలేకపోయారు. ఇలా జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పరిశ్రమలు ఏ ఒక్కటి తీసుకురాలేదు. ఏ ఒక్కరికి ఉద్యోగాలు కల్పించలేదు. బటన్ నొక్కే సొమ్ము అయినా అయా వర్గాల లబ్ధిదారులకు సకాలంలో అందించడం లేదు. ఉద్యోగ వర్గాలకు ఒకటో తేదీ జీతాలు ఇవ్వడంలోనూ ప్రభుత్వం చేతులెత్తేసింది. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా మంజూరులోనూ అన్యాయమే జరిగింది.



కేశవ్ తరపున నామినేషన్ వేస్తున్న కుటుంబ సభ్యులు



శింగనమలలో నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న శ్రావణిశ్రీ



దగ్గుబాటి తరపున నామినేషన్ వేస్తున్న శ్రీనివాసులు

కవ్వింపు చర్యలకు వైసీపీ శ్రీకారం

రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాలు అధికార వైసీపీపై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. కళ్యాణదుర్గం నియోజక వర్గం కేంద్రంలో గురువారం జరిగిన పరిణామాలే ఇందుకు నిదర్శనం. ప్రచారంలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, శ్రేణులపై స్థానిక వైసీపీ అభ్యర్థి తలారి రంగయ్య వర్గీయులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంఘటన నేపథ్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు కూటమి పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు.



కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వైసీపీ శ్రేణులు

హామీల్లోనే 'తోపు'

● ఒక్కటీ నెరవేర్చని ప్రకాష్‌రెడ్డి
● కాలనీకి ఇచ్చిన హామీలు మరిచిపోయాడు
● రోడ్లు, కాలువలు ఒట్టి మాటలే ● ఎమ్మెల్యే తోపుదుర్తిపై సదాశివన్ కాలనీ వాసుల ఆగ్రహం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 18: ' మా పార్టీకి ఓటేసి గెలిపించండి. మీ కాలనీలో సమస్యలన్నీ తీరుస్తా' ఇది అనంతపురంరూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీలోని సదాశివన్ కాలనీ ప్రజలకు 2019 లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన హామీ. దీన్ని నమ్మి ఆ కాలనీలో ఉండే పేదలంతా వైసీపీకి ఓటేశారు. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఎమ్మెల్యే హోదాలో కాలనీకి వచ్చిన తోపుదుర్తి ఆరు నెలల్లో కాలనీ రూపురేఖలు మార్చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, కాలువలు, స్కూల్ ఇతరత్ర అన్నీ ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. అంతే ఆ తర్వాత ఏళ్లు గడిచినా ఆ కాలనీవైపు తొక్కి తొంగిచూడలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చిందిలేదు. అబద్ధపు హామీలు ఇచ్చి, మమ్మల్ని ఇంత గా మోసం చేస్తావా అని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ ఏర్పాటై పదేళ్లు దాటిపోయింది..

వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారితో 2012లో కాలనీ ఏర్పడింది. దాతల సాయంతో కొంత వరకు విద్యుత్ సౌకర్యం పొందారు. స్థానికులంతా కలిసి బోరు వేసుకున్నారు. ఇప్పుడు కాలనీలో 250 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మొదట్లో ఇతర ప్రాంతాల నుంచి రావడంతో స్థానికంగా గుర్తింపు కార్డులు లేపోవడం..స్థానికులమని చెప్పుకొనే పరిస్థితి వారికి లేకుండా ఉండేది. క్రమేనా ఆధార్, ఓటరు కార్డులు ఇతరత్ర కార్డులన్నీ పొందారు. గత ఎన్నికల్లో తమ ఓటు హక్కును కూడా వినియోగించుకున్నారు. దీంతో స్థానికులు కాలనీలో తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోడ్లు, కాలువలు, ఇళ్లకుపట్టాలు, చెక్ డ్యాం దగ్గరగా ఉండటంతో ప్రహరీ నిర్మిస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి హామీ ఇచ్చినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కాగా స్థానికంగా ఉన్న మట్టి రోడ్లను తవ్వి చెరువులోని బంక మట్టిని తోలి స్థానిక సర్పంచు సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ మట్టిని తోలడం వల్ల వర్షం వస్తే అడుగు తీసి అడుగు పెట్టే పరిస్థితి ఉండదని, దీనికి తోడు ఇళ్ల కంటే రోడ్డే ఎత్తుగా ఉండటంతో వర్షపునీరు ఇళ్లలోకి వచ్చి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




రోడ్డు కంటే దిగువలో ఉన్న ఇళ్లు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చార్లెస్ డార్విన్ (వర్ధంతి)



జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త చార్లెస్ రాబర్ట్ డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లాండులో జన్మించారు. 'డార్విన్స్ థియరీ ఆఫ్ ఎవల్యూషన్' భూమిమీద జీవుల పరిణామక్రమాన్ని తెలియచేస్తుంది. ఆధునిక జీవశాస్త్రంలో డార్వినిజం ఎంతోమార్పు తెచ్చింది. మూఢనమ్మకాలను విభేదించడంలో కూడా కీలకపాత్ర పోషించింది. 'డార్వినిజం' ప్రపంచంలో ఎంతోమంది భౌతికశాస్త్రవేత్తలను, జీవశాస్త్రవేత్తలను ప్రభావితం చేసి ఆధునిక భౌతికశాస్త్ర విజ్ఞానాన్ని ఎన్నో మలుపులు తిప్పింది. వందలాది పురస్కారాలు అందుకున్నారు. 1882 ఏప్రిల్ 19న కన్నుమూశారు.

ముకేశ్ అంబానీ (పుట్టినరోజు)



దేశంలో పేరొందిన రిలయెన్స్ ఇండస్ట్రీస్ సంస్థకు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ముకేశ్ ధీరూబాయి అంబానీ 1957 ఏప్రిల్ 19న జన్మించారు. 2023 ఫిబ్రవరి నాటికి ప్రపంచ శ్రీమంతు లలో 13వస్థానంలో నిలిచారు. వ్యాపారవేత్తగా పలు అవార్డులు అందుకున్నారు. 'బ్యాంక్ ఆఫ్ అమెరికా'కు నాన్ అమెరికన్ కేటగిరీలో నియమతులైన డైరెక్టర్. కాగా ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టుకు ఫ్రాంఛైజీగా వ్యవహరిస్తున్నారు. ఫుట్‌బాల్‌ను ప్రోత్సహించేలా ఇండియన్ సూపర్‌లీగ్‌ను ఏర్పాటు చేశారు.

మేడసాని మోహన్ (పుట్టినరోజు)



ప్రముఖ అవధానిగా డాక్టర్ మేడసాని మోహన్ 1955 ఏప్రిల్ 19న చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నడింపల్లెలో జన్మించారు. 15వ యేటకే తొలిసారి అష్టావధానం చేసి పండితులచే ప్రశంసలు అందుకున్నారు. టీటీడీ అనుబంధమైన అన్నమాచార్య ప్రాజెక్టుకు డైరెక్టర్‌గా వ్యవహరించారు. తెలుగు, సంస్కృత సాహిత్యంలో దిగ్గజం. 600కుపైగా అష్టావధానాలు చేశారు. సహస్రావధానం, పంచస హస్రావధానం కూడా చేశారు. అన్నమాచార్య కీర్తనలపై పరిశోధనచేసి మద్రాస్ యూనివర్శిటీచే పీహెచ్‌డీ అందుకున్నారు. అహోబిలం మఠం ఆస్థానపండితుడిగా వ్యవహరిస్తున్నారు.

మరియ షరపోవా (పుట్టినరోజు)



మరియ యూరివ్నా షరపోవా 1987 ఏప్రిల్ 19న సోవియెట్ యూనియన్‌లో న్యాగన్‌లో జన్మించారు. రష్యాకు చెందిన ఆమె టెన్నిస్ క్రీడాకారిణి. 18ఏళ్లకే వరల్డ్ నెంబరు వన్‌గా నిలిచిన ఆమె 2001-2020 వరకు సింగిల్స్‌లో డబ్ల్యూటీఏచే ఐదు సార్లు నెంబరు వన్‌గా కొనసాగారు. కెరీర్ గ్రాండ్‌స్లామ్ తొలి రష్యన్ విజేత. 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో సింగిల్స్‌లో రజత పతకం కైవశం చేసుకున్నారు. ఐదు గ్రాండ్‌స్లామ్, రెండు ఫ్రెంచ్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ మొత్తం 36 టైటిల్స్ సాధించారు. డబుల్స్‌లోనూ సత్తా చాటుకున్నారు. 2020లో టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

విద్యార్థులు తప్పు చేస్తేనే కొత్త అంశాలు నేర్చుకుంటారు

» ఆంగ్ల సాహితీవేత్త దర్శిని జాకోబ్ అభిప్రాయం

బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో తప్పులు చేస్తేనే కొత్త అంశాలు నేర్చుకోవడం సాధ్యమని అంగ్ల సాహితీవేత్త దర్శిని జాకోబ్ అభిప్రాయపడ్డారు. జయనగర్ సిటీ కళాశాలలో బిజినెస్ టాక్ షోను గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి దర్శిని జాకోబ్ మాట్లాడుతూ బాల్యం నుంచే భయం లేకుండా తప్పులు చేయాలన్నారు. అప్పుడే ఏది సరైనదని తెలుసుకునేందుకు సాధ్యం కానుందన్నారు. విద్యార్థులు రంగస్థలంలో భాగస్వాములు కావాలన్నారు. తద్వారా తాను పోషించే పాత్రకు ఎంత మేర న్యాయం చేస్తారనేది తెలుస్తుందన్నారు. అదే తరహాలోను విద్యలోను కొత్త విషయాలను తెలుసుకునేందుకు వీలుకల్పించుకోవాలన్నారు. భయం, జంకు అనేవి లేకుండా ప్రశ్నించే తత్వం పెంచుకోవాలన్నారు కార్యక్రమంలో విభిన్నరంగాలకు చెందిన ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు భాగస్వాములయ్యారు. హెచ్‌ఆర్‌లు నికోల్ లీ, క్రిస్టోఫర్ కింగ్, స్టీఫెన్ కోక్ తదితరులు భాగస్వాములయ్యారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ పుట్టరాజు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సిటీ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా కల్లూరి అతిథులకు, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



బిజినెస్ టాక్ షోలో పాల్గొన్న ప్రముఖులు

బీజేపీని దూషిస్తుంటే ఈశ్వరప్పకు ఏజెంట్లు దొరకరు

» మాజీ మంత్రి అరగ జ్ఞానేంద్ర

బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శివమొగ్గ లోక్‌సభ స్థానం నుంచి ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన బీజేపీ సీనియర్‌నేత ఈశ్వరప్ప తీరుపై మాజీ మంత్రి అరగ జ్ఞానేంద్ర తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శివమొగ్గలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈశ్వరప్ప ఇదే తరహాలో బీజేపీని తిడుతూ ఉంటే ఆయనకు దక్కే ఓట్లు ఎలా ఉన్నా కనీసం పోలింగ్ బూత్‌లకు ఏజెంట్‌లు దొరకరంటూ ఎద్దేవా చేశారు. ఈశ్వరప్ప పరిస్థితిని అర్థం చేసుకోవాలన్నారు. శివమొగ్గలో ఎంపీ రాఘవేంద్రను ఓడించడం సాధ్యం కాదన్నారు. మరోసారి గెలుపు సాధించి లోక్‌సభకు వెళతారన్నారు. అయినా ఈశ్వరప్ప విజయాలు ఏంటో ప్రజలకు వివరించాలన్నారు. బెంగళూరులో జై శ్రీరాం నినాదాలు చేసిన వారిపై దాడి సరి కాదని అభిప్రాయపడ్డారు.

రేపు ప్రధాని నరేంద్రమోదీ చిక్కబళ్ళాపురకు...

బాగేపల్లి, జనవరి 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 20న చిక్కబళ్ళాపురకు విచ్చేయనున్నారని చిక్కబళ్ళాపుర బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామలింగప్ప వెల్లడించారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చిక్కబళ్ళాపుర పరిధిలోని అగలగుర్కిలో భారీ సమావేశంలో ప్రధాని పాల్గొంటారన్నారు. చిక్కబళ్ళాపుర, కోలారు లోక్‌సభ అభ్యర్థులు మల్లేశ్‌బాబు, డాక్టర్ కే సుధాకర్‌ల తరపున ప్రచారం చేస్తారన్నారు. మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ సీఎంలు యడియూరప్ప, కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్ భాగస్వాములవుతారన్నారు. మీడియా సమావేశంలో బీజేపీ, జేడీఎస్ నాయకులు మునిరాజు, కోనప్ప రెడ్డి, చన్నకృష్ణరెడ్డి, హరినాథరెడ్డి, రాజారెడ్డి, మిథున్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, పాచేపల్లి నాగరాజు, ఆర్ ప్రతాప్, జేపీ చంద్రశేఖర తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామలింగప్ప తదితరులు

కర్ణాటక యువకుడి అత్యుత్సాహం

» తిరుమల శ్రీవారి ఆలయం ముందు కాంగ్రెస్ నేతల ఫొటో ప్రదర్శన

తిరుమల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా కర్ణాటకకు చెందిన నాగేంద్ర అత్యుత్సాహం ప్రదర్శించారు. కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సౌమ్యారెడ్డితో పాటు మరికొందరు నేతల ఫొటోలతో ఉన్న ఫ్రేంను చూపిస్తూ శ్రీవారి ఆలయం ముందు హల్‌చల్ చేశాడు. సాధారణంగా తిరుమలకు రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల ఫొటోలను తీసుకురావడం, వాటిని ప్రదర్శించడం, ప్రచారం చేయడం నిషేధం.భద్రతా వ్యవస్థతో పాటు, సీసీ కెమెరాల నిఘా ఉండే ప్రాంతంలో ఇలా నేతల ఫొటోలను ప్రదర్శిస్తున్నా భద్రతా సిబ్బంది పట్టించుకోకపోవడం గమనార్హం. సౌమ్యారెడ్డి అధిక మెజార్టీతో గెలవాలని స్వామిని కోరుకున్నట్టు మీడియా ముందుకు వచ్చి నాగేంద్ర చెప్పారు.



ఫొటో ఫ్రేమ్‌ను ప్రదర్శిస్తున్న నాగేంద్ర

కాంగ్రెస్ ప్రెస్‌మీట్ బహిష్కరణ

» కాంగ్రెస్ ప్రచార సమితి అధ్యక్షుడి తీరును ఖండిస్తూ మీడియా తీర్మానం



దొడ్డబళ్ళాపుర, జనవరి 18: మీడియా పట్ల అవహేళనగా మాట్లాడిన కాంగ్రెస్ ప్రచార సమితి అధ్యక్షుడు జీ లక్ష్మీపతి తీరును ఖండిస్తూ దొడ్డబళ్ళాపుర స్థానిక పాత్రికేయులు గురువారం ఏర్పాటైన ప్రెస్‌మీట్‌ను బహిష్కరించారు. ఈనెల 16న మాజీ ఎమ్మెల్యే టీ వెంకటరమణయ్య నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో లక్ష్మీపతి స్థానిక పాత్రికేయుల పట్ల చులకనగా మాట్లాడారు. ఈ నేపథ్యంలో గురువారం ఏర్పాటైన ప్రెస్‌మీట్‌ను బహిష్కరించారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ విభాగం గురువారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆహ్వానించింది. అయితే మీడియాను నిర్లక్ష్యం చేసిన లక్ష్మీపతి తీరును ఖండిస్తూ వెంటనే ఆయనను సదరు కాంగ్రెస్ ప్రచార సమితి అధ్యక్షస్థానం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ చేపట్టే ఏ సమావేశాన్ని కవరేజ్ చేసేది లేదని మీడియా దొడ్డబళ్ళాపుర మీడియా వర్గం తీర్మానించింది.

దర్శన్ ప్రచారం తప్పేమీ కాదు : కుమార

బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండ్య కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణగౌడ అలియాస్ స్టార్ చంద్రు కోసం ప్రముఖ నటుడు దర్శన్ ప్రచారం చేయడం తప్పేమీ కాదని ఇదే నియోజకవర్గం బీజేపీ- జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి కుమారస్వామి అభిప్రాయపడ్డారు. గురువారం ఆయన మండ్యలో మీడియాతో మాట్లాడారు. నటుడు దర్శన్ రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారన్నారు. సరిగ్గా ఐదేళ్ళ కిందట మండ్య నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నటి సుమలతా అంబరీష్ పోటీ చేశారు. సుమలత తరుపున స్టార్ హీరోలు దర్శన్, యశ్‌లు విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రస్తుతం సుమలత మండ్య టికెట్ కోసం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. మరోసారి ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు వెనకడుగు వేశారు. అయితే దర్శన్ రాజకీయాలకు దూరంగా ఉండాలని భావించారు. కానీ అభ్యర్థి స్టార్ చంద్రు కోరిక మేరకు ప్రచారాలకు దర్శన్ సిద్ధమైనట్లు తెలుస్తోంది.



మీడియాతో కుమారస్వామి

ఎవరూ ఆసక్తి చూపకపోవడంతోనే

నా కుమార్తెకు టిక్కెట్ : జార్కిహోళి

బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బెళగావి నుంచి టిక్కెట్ కోసం ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో తన కుమార్తె ప్రియాంకకు టిక్కెట్ కేటాయించారని మంత్రి సతీశ్ జార్కిహోళి వెల్లడించారు. చిక్కోడిలో గురువారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కుటుంబీకులకు మాత్రమే టిక్కెట్ ఇస్తారన్న బీజేపీ ఎమ్మెల్యే యత్నాళ్ ఆరోపణలపై మంత్రి సంప్రదించారు. దారినపోయే దానయ్యకు టిక్కెట్‌లు ఇవ్వరన్నారు. ఎన్నికల్లో ఎవరూ ఆసక్తి చూపలేదని, అధిష్ఠానం, స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించాకే తన కుమార్తెకు టిక్కెట్ కేటాయించారన్నారు. యత్నాళ్‌ను ఓడించేందుకు 15మందిని పంపలేదని, ఇదంతా రాజకీయ ప్రేరేపితమన్నారు. ఎన్నికలన్నాక ఆరోపణలు సహజమన్నారు. శ్మశానాల్లో పూజలు, చైతన్య కార్యక్రమాలు ఒకరికోసం కాదని తన సొంత విధానాలన్నారు. గ్యారెంటీలతో రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పట్ల విశ్వాసంతో ఉన్నారన్నారు. నియోజకవర్గంలో పార్టీకి ఇబ్బందికరం లేదన్నారు.



మంత్రి సతీశ్ జార్కిహోళి

పురానికి చేరుకున్న బాలకృష్ణ



బాలయ్యకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 18 : టీడీపీ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడానికి స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం సాయంత్రం పురానికి చేరుకున్నారు. మూడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను శుక్రవారం మధ్యాహ్నం 12.10కు ఆయన ఆర్‌ఓకు అందజేయనున్నారు. అయితే ఈ సారి బాలకృష్ణతో పాటు ఆయన సతీమణి నందమూరి వసుంధరాదేవి కూడా డమ్మి అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు ఇదే సమయానికి అందజేయనున్నారు. బాలయ్య దంపతులు శుక్రవారం సానిక సూగూరు ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహిస్తారు. అనంతరం కొద్దిమందితో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు అందజేయనున్నారు. అనంతరం సాయంత్రం సూగూరు ఆలయం నుంచి వేలాది మందితో ర్యాలీ నిర్వహించనున్నట్లు టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు.

బాలయ్యకు సత్కారం

టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను సత్కరించారు. పురానికి చేరుకున్న బాలకృష్ణను కొల్లకుంట అంజినప్ప కుటుంబ సభ్యులు కలిసి సత్కరించారు. జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధితో పాటు బాలయ్య గెలుపులో వడ్డెర్లు కీలకంగా పనిచేస్తారని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. బాలకృష్ణ మాట్లాడుతూ పార్టీచేసిన సేవను గుర్తించి జిల్లా అధ్యక్ష పదవి వచ్చిందన్నారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తూ జిల్లాలో అందరినీ కలుపుకుని పనిచేయాలన్నారు.

మీరు రావడానికి వీల్లేదు!

● మీడియాపై పోలీసుల ఆంక్షలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18: ఎన్నికల నామినేషన్ తొలిరోజే పోలీసులు ఆంక్షలు విమర్శల పాలవుతున్నాయి. ప్రత్యేకంగా మీడియాపై కఠినంగా వ్యవహరించారు. కనీసం పౌరసంబంధాల శాఖకు వెళ్లడానికి కూడా అనుమతివ్వలేదు. అనంతపురం నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి నామినేషన్లను గురువారం స్వీకరించారు. గత ఎన్నికల సమయంలోనూ అదే కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించారు. ఆ సమయంలో ఆర్డీఓ కార్యాలయంలోపలికి అందరినీ అనుమతించారు. కానీ ఈసారి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆర్డీఓ కార్యాలయానికి దూరంగానే బారికేడ్లు పెట్టి అనుమతించకుండా ఆపేశారు. లలితకళాపరిషత్ వైపు, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వైపు, నేరుగా ఉన్న మరోదారిని పూర్తిగా మూసివేశారు. టూటౌన్ పోలీసులు విలేకరులను డీపీఆర్వో కార్యాలయంలోపలికి సైతం అనుమతించలేదు. ఉద్యోగుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. కొందరిని ఐడీ కార్డు చూపిస్తే కానీ లోపలికి అనుమతించలేదు. ఓ మహిళా ఉద్యోగి కార్డు మరచిపోయానని చెప్పినా వినలేదు. మరో దారి నుంచి వెళ్లాల్సి వచ్చింది. ఫారెస్ట్ రేంజ్ సెక్షన్ ఆఫీసర్ రామాంజనేయులు అక్కడున్న మూడు బారికేడ్ల వద్ద ఐడీ కార్డు చూపినా లోపలికి అనుమతించ లేదు. దీంతో తాము విధులెలా నిర్వర్తించాలంటూ అసహనం వ్యక్తం చేశారు. డీఆర్‌డీఏ, డ్వామా, ఫారెస్ట్, హార్టికల్చర్ కార్యాలయాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఆర్డీఓ కార్యాలయం సమీపంలో పోలీసుల ఆంక్షలు




అమ్మోరి దయ !

రాజకీయ నాయకులకు బాటసుంకులమ్మ సెంటిమెంట్

గుంతకల్లు నియోజకవర్గంలోని రాజకీయ నాయకులకు ముందుగా బాటసుంకులమ్మకి పూజలు చేసిన తర్వాతే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టడం సెంటిమెంట్‌గా మారింది. మండలంలోని కరిడికొండ గ్రామశివారులో 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన బాటసుంకులమ్మ ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. నియోజకవర్గంలో కర్నూలు జిల్లా సరిహద్దులో ఈ అమ్మవారు దేవుడి (ఈశాన్య) మూలలో ఉంది. అందుకే అధికార పార్టీ, ప్రతిపక్ష రాజకీయ నాయకులు అమ్మవారి దేవాలయానికి వచ్చి పూజలు చేసిన తరువాత పనులు మొదలు పెడతారు. జిల్లానాయకులకు ఏ పదవి వచ్చిన, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి జిల్లాలో అడుగు పెట్టే ముందు ఈ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన తరువాత వారి నియోజకవర్గానికి వెళ్తుంటారు.

- గుత్తిరూరల్

బొమ్మల కథ

కోడ్ వచ్చినా స్మార్ట్ మీటర్లపై తొలగని జగన్ బొమ్మ

వ్యవసాయ విద్యుత్ మీటర్లకు ఏర్పాటు చేసిన జగన్ బొమ్మలను ఎన్నికల కోడ్ వచ్చినా మండలంలో తొలగించలేదు. ఈ మీటర్లకు జగన్ ఫొటో ఉన్న నవరత్నాల స్టిక్కర్లు అతికించారు. స్మార్ట్‌మీటరుపై వైఎస్ఆర్ ఉచిత వ్యవసాయ పథకం పేరు ఉంది. మండల వ్యాప్తంగా 3వేలకుపైగా స్మార్టు మీటర్లు ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో జగన్ బొమ్మ కానరాకుండా చేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- పెనుకొండ రూరల్



↑ మంగాపురంలో వ్యవసాయ బోరుబావికి స్మార్ట్‌మీటర్లపై తొలగని బొమ్మలు

ఎస్ఐ పోస్టుల అక్రమార్కులతో...

బీజేపీ అభ్యర్థి చెట్టాపట్టాల్

బెంగళూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 545 సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ కోసం జరిగిన రాత పరీక్షల వేళ పలు విధాలుగా అక్రమాలకు పాల్పడి జైలుపాలై బెయిలుపై బయటకు వచ్చిన ఆర్‌డీ పాటిల్, దివ్యా హాగరగిలతో బీజేపీ కలబురగి అభ్యర్థి ఉమేష్ జాధవ్ చెట్టాపట్టాలేసుకుని తిరుగడం సర్వత్రా చర్చనీయాంశమైంది. బుధవారం ఎస్ఐ పోస్టుల అక్రమాల కింగ్‌పిన్ ఆర్‌డీ పాటిల్ నివాసానికి ఉమేష్ జాధవ్ వెళ్ళారు. పాటిల్ నివాసంలోనే ఎక్కువ సమయం గడిపిన ఉమేష్ జాధవ్ అక్కడే టిఫిన్ చేశారు. తాజాగా గురువారం ఇదే కేసులో ఉన్న మరో సూత్రధారి దివ్యా హాగరగి నివాసానికి వెళ్ళారు. కాసేపు ఇద్దరూ చర్చలు జరిపారు. ఆర్‌డీ పాటిల్ ఇంటికి వెళ్ళడంతోనే ఉమేష్ జాధవ్ పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఎదురయ్యింది. లక్షలాదిమంది భవిష్యత్తుతో చెలగాటమాడి ఉద్యోగాలు దక్కకుండా చేసిన అవినీతి పరులుకు అక్రమాలకు పాల్పడిన ఇద్దరు సూత్రధారుల ఇళ్ళకు బీజేపీ ఎంపీ వెళ్ళడాన్ని ఏమని అర్థం చేసుకోవాలని ప్రశ్నిస్తున్నారు. నెటిజన్‌లు ఉమేష్ జాధవ్ వ్యవహరించిన విధానంపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడవి పందిని తప్పించబోయి పంచాయతీ సభ్యుడి మృతి

పావగడ, ఏప్రిల్ 18: తాలూకా పరిధిలోని బెళ్లిబెట్టు గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సభ్యుడు కృష్ణప్ప(46) అడివి పందిని తప్పించబోయి జరిగిన బైకు ప్రమాదంలో మృతి చెందారు. బుధవారం రాత్రి కృష్ణప్ప భార్యతో కలిసి తన బంధువుల ఊరైన అచ్చంపల్లికి వెళ్లి రాత్రి సమయంలో తిరిగి తన స్వగ్రామానికి వస్తున్నారు. శైలాపురం, కోటగుడ్డం మధ్యలోని మద్రేనహళ్లి ఫారెస్టులో అడవి పందుల గుంపు ఆకస్మికంగా రోడ్డుకు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించబోయి కల్వర్టును ఢీకొని కిందపడ్డారు. భార్య గ్రామస్తుల సహకారంతో 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేసినా ఫలించక ఆస్పత్రిలోనే మృతి చెందాడు. ఈఘటనపై వై.ఎన్.హొసకోట పోలీసులు ఎస్ఐ మాళప్ప కేసు నమోదు చేసుకొన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే వెంకటేష్, మాజీ మంత్రి వెంకటరమణప్ప కృష్ణప్ప మృతికి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సారక్కిపార్కులో జంట హత్యలు


బెంగళూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సారక్కి పార్కులో గురువారం సాయంత్రం జంట హత్యలు చోటు చేసుకున్నాయి. నిత్యం రద్దీగా ఉండే పార్కులో సురేశ్, అనూషా అనే ఇద్దరిని గర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. సాయంత్రం 4.15 గంటలకు పార్కులో వారిద్దరూ కూర్చుని ఉండగా బండరాళ్ల వేసి హతమార్చారు. జేపీ నగర్ పోలీసులు సంఘటనాస్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హతుల వివరాలు తెలియాల్సి ఉంది.

సెంటిమంట

గుంతకల్లుకు వస్తే సీఎం పదవి గోవింద!



గుంతకల్లు, ఏప్రిల్18: నియోజకవర్గ కేంద్రమైన గుంతకల్లు పేరుచెబితే పదవిలో ఉన్న ఏ రాజకీయ నాయకుడికైనా జడుసుకుంటాడు. అధికారంలో ఉండి గుంతకల్లుకు వస్తే ఉన్న పదవి ఊడిపోతుందని, ముఖ్యమంత్రులు వస్తే వారి పదవులేకాదు, పార్టీ గెలుపుకూడా గోవిందా అనక తప్పదనే నమ్మకం ఉంది. ముఖ్యమంత్రులుగా ఉన్న విజయభాస్కర్ రెడ్డి, చెన్నారెడ్డి, జనార్దన రెడ్డి, చంద్రబాబునాయుడు గుంతకల్లుకు వచ్చిన తర్వాత పదవులు కోల్పోయినవారే. 1983లో విజయభాస్కరరెడ్డి, 1991లో చెన్నారెడ్డి, 1992లో జనార్దనరెడ్డి, 2004లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో గుంతకల్లుకు వచ్చారు. తదనంతరం జరిగిన ఎన్నికల్లో పార్టీలు పరాజయం పొంది విజయభాస్కరరెడ్డి, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవులు కోల్పోయారు. చెన్నారెడ్డి, జనార్దన రెడ్డికి అధిష్ఠానం కారణంగా పదవులు పోయాయి. ఆర్టీసీ బస్టాండు ప్రారంభోత్సవానికి గుంతకల్లుకు వచ్చిన చెన్నారెడ్డికి ముఖ్యమంత్రి పదవి జారిపోగా, జనార్దనరెడ్డి సీఎం అయ్యారు. జీఎస్టీసీలో పాతకొత్తచెరువు వద్ద బైపాస్ కెనాల్ శంకుస్థాపన కోసం చెన్నారెడ్డి గుంతకల్లు రాగా, తదనంతరం పదవి కోల్పోయారు. దీంతో ఆయన స్థానంలో మరో సీల్డు కవర్ ముఖ్యమంత్రిగా కోట్ల విజయభాస్కర రెడ్డి అధికారంలోకి వచ్చారు. అధికారంలో ఉన్న ఏ నాయకుడైనా, ఇతర జిల్లాలకు చెందిన మంత్రులైనా గుంతకల్లుకు వస్తామంటే స్థానిక నాయకులు ఇక్కడి సెంటిమెంటును వారికి చెప్పి వద్దని వారిస్తుంటారు. అయితే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్మోహన్ రెడ్డి తదితరులు గుంతకల్లు వచ్చి తదుపరి ఎన్నికల్లో విజయం సాధించి సీఎం పదవిని అధిష్ఠించడం గమనార్హం.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.74	1,576.85
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	112	248
సామర్థ్యం (టీఎంసీలు)	3.89	3.13

పోరాటాల ద్వారా రాజకీయాలు



మాట్లాడుతున్న సీఐటీయూసీ అభ్యర్థి దేవదాస్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 18: పోరాటాల ద్వారా రాజకీయాలను నిలబెట్టడమే ప్రజల ముందున్న అతిపెద్ద బాధ్యత అని సీఐటీయూసీ అభ్యర్థి దేవదాస్ అన్నారు. జిల్లాలోని యాళ్పి, కగ్గల్ గ్రామాలలో గురువారం పనుల్లో నిమగ్నమైన రైతు కార్మికులతో అభ్యర్థి దేవదాసు మాట్లాడుతూ ప్రజల అజ్ఞానాన్ని ఉపయోగించుకొని బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీలు తమ రాజకీయ పంటలు పండించుకుంటున్నాయన్నారు. కులం, మతం వంటి భావోద్వేగాలను ఉపయోగించి కోరికలు ఎరలుగా చూపి ఆ పార్టీలు ఓట్లు పొందుతున్నాయన్నారు. ఇలాంటి మోసాల బారిన పడకూడదని, వారు ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు మీరు ప్రశ్నించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నీచ రాజకీయాలతో సంబంధం లేకుండా ఎస్‌యూసీఐ పార్టీ ప్రజల సమస్యలపై రాజీలేకుండా నిరంతరం పోరాడుతోందన్నారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దోవింద్, గురల్లి రాజా, ప్రకాశ్, రైతులు తిప్పయ్య, రాజా మారయ్య, మహేశ్, హులుగన్న, శర్మ, ప్రభు, బసవరాజ్, షేక్షావలి, రోషన్, చిదానంద్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు, కుంకుమలతో ఓటింగ్‌పై అవగాహన



పసుపు, కుంకుమ పంపిణీ చేస్తున్న మహిళలు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పంచాయితీ, జిల్లా స్వీప్ కమిటీ సన్నాహాలు చేపట్టింది. గత లోక్‌సభ ఎన్నికలకంటే ఈ సారి ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా బళ్లారి జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో ఇప్పటికే ఓటింగ్‌పై ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బళ్లారి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మహిళా శిశు అభివృద్ధి శాఖ తరపున జిల్లా స్వీప్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు పసుపు, కుంకుమ పంపిణీ చేస్తూ ఓటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

గాలివానకు ఒరిగిన అరటిపంట



అకాలవర్షంతో నేలకూలిన అరటి పంట

కంప్లి, ఏప్రిల్ 18 : విజయనగర జిల్లా హువిన అడగలి తాలూకా సుగ్గి గ్రామంలో గాలివాన ప్రభావంతో పూర్తిగా పంటలు నేలకొరిగాయి. రేపో.. మాపో.. అరటి గెలలను దింపుతామనే సమయంలో ఇలా చేతికొచ్చిన పంట నేలపాలైందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో పెట్టిన పెట్టుబడులు నేలపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు, పదాధికారులు అధికారులను కోరారు.

అధికారంలోకి వస్తే గ్యారెంటీల అమలు

ఎమ్మెల్యే బీఎం నాగరాజ, కాంగ్రెస్ నాయకుల వెల్లడి

సిరుగుప్ప, ఏప్రిల్ 18 : కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యారెంటీలను అమలు చేస్తామని ఎమ్మెల్యే బీఎం నాగరాజ, తదితర కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆయన గురువారం తాలుకాలోని తాళూరు, హోసళ్లిలలో కొప్పాళ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్ తరపున ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గ్రామ గ్రామానా పర్యటించారు. కాంగ్రెస్ విడుదల చేసిన గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాలుకా అధ్యక్షులు కరిబసప్ప, యువనాయకులు కోటిరెడ్డి, పవన్ కుమార్ దేశాయ్, గణేష్, వెంకటేష్, గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

నూతన కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 18 : బళ్లారి నగరం గాంధీనగర్‌లో బళ్లారి ఇన్‌ఛార్జ్ మంత్రి నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ నేతృత్వంలో గురువారం కాంగ్రెస్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లం ప్రశాంత్ మాట్లాడుతూ.. గతంలో వుండే కాంగ్రెస్ పార్టీ కార్యాలయం చిన్నదిగా వున్నందువలన గాంధీనగర్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యాలయం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అనుకూలంగా వుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ శ్వేత, ఉపమేయర్ జానకమ్మ, కార్పొరేటర్లు కుబేర, మించు శ్రీనివాస్, విక్కి, బీఆర్ఎస్ శ్రీనివాస్, నందీష్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



తాళూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగేంద్ర

ఎంపీ అభ్యర్థి శ్రీరాములు ప్రచారం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 18 : బళ్లారి నగరంలోని 11,12,13 వార్డులలో లోక్‌సభ బీజేపీ అభ్యర్థి శ్రీరాములు విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ చేసిన అభివృద్ధిని చూసి కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. రాబోయే కాలంలో ప్రధానిగా మోడీ రావాలని అప్పుడే దేశం సస్యశ్యామలంగా వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సిటీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు అనిల్ నాయుడు మోకా, కార్పొరేటర్ ఇబ్రహీం బాబు, బళ్లారి బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఓటరు జాగృతి


బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 18: వచ్చే మే నెల 7వ తేదీన తప్పకుండా ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా పంచాయతీ సిఇఓ, స్వీప్ నోడల్ అధికారి రాహుల్ శరణప్ప సంకనూరు ప్రజలకు పిలుపునిచ్చారు. బళ్లారి తాలూకా పరిధిలోని సంజీవరాయన కోట గ్రామ పంచాయతీ వ్యాప్తిలోని మింజేరి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పనుల నిర్వహించే స్థలంలోనే ఓటు జాగృతి కార్యక్రమాన్నినిర్వహించి ఓటు హక్కు మహత్యాన్ని తెలియజేశారు. పటిష్టమైన ప్రభుత్వ ఏర్పాటులో ఓటరు పాత్ర ప్రముఖ మైనదని, ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు.



బళ్లారిలో ప్రచారం చేపట్టిన బీజేపీ లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి

వేగంగా జంబునాథ్ ఆలయ జీర్ణోద్ధరణ

- జాంబవంతుడి ప్రార్థనలతో వెలసిన శివుడు
- కోర్టు ఆదేశాలతో ఆలయ పరిరక్షణ పనులు
- రూ.3.07 కోట్లతో నిధి ఏర్పాటు
- 21 నుంచి జాతర కోసం పనుల నిలిపివేత



జంబునాథ్ దేవాలయం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 18: రామాయణ కాలంలో శ్రీరాముడు చేపట్టిన వారధి నిర్మాణ పనులు సజావుగా సాగాలని జాంబవంతుడు శివుడిని ప్రార్థించిన ప్రదేశమే జంబునాథ కొండ . అందువల్లనే ఇక్కడి శివుడికి కూడా అదే పేరు వచ్చిందని చెబుతారు. జంబునాథ ఆలయాన్ని విజయనగర రాజు ప్రౌఢదేవరాయలు నిర్మించినట్లు చెబుతారు. ఇక్కడి రాతి శిల్పాలు ప్రత్యేకమైనవి. కొన్నేళ్ల క్రితం ఆలయ సమీపంలో జరిగిన మైనింగ్ కారణంగా ఆలయంలోని కొన్నిరాతి స్థంబాలు కూలిపోయాయి. రాతి పైకప్పులకు పగుళ్లు ఏర్పడ్డాయి. మైనింగ్‌తో ఆలయానికి ముప్పు వాటిల్లడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. వివాదం సుప్రీంకోర్టు వరకు వెళ్ళింది. చివరకు కోర్టు ఆదేశాల మేరకు ఆలయ పరిరక్షణ పనులకు ప్రత్యేక నిధిని ఏర్పాటుచేశారు. ఎన్నో దశాబ్దాలుగా, ఎంతోమంది కలగంటున్న ఈ జంబునాథ ఆలయ పునరుద్ధరణ పనులు సందడి లేకుండా కొనసాగుతున్నాయి. హంపీ విరూపాక్ష దేవాలయం తర్వాత తాలూకాలో రెండవ అతిపెద్ద శివాలయం ఇది. జంబునాథ ఆలయంలోని రాతి స్తంబాలు, పైకప్పుల పరిరక్షణ పనులు రాష్ట్ర పురావస్తు శాఖ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. రూ.3.07కోట్ల వ్యయంతో గత ఆరు నెలలుగా జరుగుతున్న ఈ పనుల్లో భాగంగా రాతి స్తంభాలు చెక్కడం, క్యూరింగ్, పర్నిషింగ్ పనులు కొనసాగుతున్నాయి. అందుకోసం ఆలయంలోని రాతి మండపాలు, పైకప్పుకు ఏమాత్రం నష్టం కలగని విధంగా పరిరక్షణ పనులను చేస్తున్నారు. బాగల్‌కోటకు చెందిన బీఎస్ పోట్టర్ కంపెనీకి ఈ పనుల కాంట్రాక్ట్ దక్కింది. ఎంతో నైపుణ్యం కలిగిన శిల్పులు ఇక్కడ పని చేస్తున్నారని పురావస్తు శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కుబేరప్ప తెలిపారు.

21న జాతరకు ఏర్పాట్లు

ఏప్రిల్ 21నుంచి జంబునాథుని జాతర ప్రారంభం కానుండడంతో ఆలయ పరిరక్షణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. జాతర ముగిసిన తర్వాత మళ్ళీ పనులు ప్రారంభిస్తామని కార్యనిర్వాహణాధికారి హనుమంతప్ప తెలిపారు. జంబునాథుని ఆరాధించే కుటుంబాలు హోస్పేట చుట్టుప్రక్కల చాలా ఉన్నాయి. జంబునాధుని కొండపైకి వెళ్లలేని వారి కోసం వడకరాయ ఆలయ ప్రాంగణంలో జంబునాథుడిని ప్రతిష్ఠించి పూజలు చేసేందుకు ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి హనుమంతప్పకు అండగా కలెక్టర్ దివాకర్ నిలబడడంతో ప్రత్యేక శ్రద్ధతో ఆలయ పరిరక్షణ పనులు కొనసాగుతున్నాయి.

వైభవంగా భావి ఆంజనేయస్వామి రథోత్సవం

కంప్లి, ఏప్రిల్ 18 : కురుగోడు తాలుకా బాదనట్టి గ్రామంలో భావి ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హంపి సావిర మఠం వామదేవ శివాచార్యులు, హళ్లిమఠం గవిసిద్ధయ్య, కలకంబ్ల రుద్రముని తాత పాల్గొని రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారికి అరటిపండ్లతో ప్రత్యేకాలంకరణ చేపట్టారు. నూతనంగా ప్రారంభించిన రథోత్సవం కావడంతో కురుగోడు, ఎర్రంగళి, వన్నళ్లి, వడ్డట్టి, గ్రామాలతో పాటు బళ్లారి, సిరుగుప్ప, కంప్లి, గంగావతి, హోస్పేట, బెంగళూరు పట్టణాల నుంచి భారీసంఖ్యలో భక్తులు పాల్గొని పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే నంది కోళ్లు, కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.



జనసందోహం నడుమ సాగుతున్న రథోత్సవం

బీజేపీ తరపున మరో నామినేషన్



నామినేషన్ సమర్పిస్తున్న బీజేపీ మద్దతుదారులు

బళ్లారి సిటీ,ఏప్రిల్ 18: బళ్లారి లోక్‌సభ స్థానానికి గురువారం ఒక నామినేషన్ దాఖలైంది. బీజేపీ అభ్యర్థి శ్రీరాములు తరపున ఆయన మద్దతుదారులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు ఈ నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బంగారు హనుమంతు, విజయనగరం జిల్లా కార్యదర్శి రామన్న, విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు చన్నబసవన్‌గౌడ పాల్గొన్నారు. నామినేషన్ పత్రాల సమర్పణకు ఏప్రిల్ 19 చివరి రోజు కాగా.. ఏప్రిల్ 20న నామినేషన్ పత్రాల పరిశీలన, ఏప్రిల్ 22న నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు

పది కి.మీ. దూరం సాష్టాంగ నమస్కారాలు



సాష్టాంగ నమస్కారాలు చేస్తున్న దేవప్ప, దుర్గప్ప

కంప్లి, ఏప్రిల్ 18 : ఒక్కసారి వంగి నేలనంటుకుని సాష్టాంగ నమస్కారం చేయాలంటే ఎంతో కష్టంగా భావిస్తాం. అలాంటిది విజయనగర జిల్లా ఆలూమరచికేరి గ్రామానికి చెందిన కొలిచి రేవప్ప, భోవి దుర్గప్పలు పది కిలోమీటర్ల పాటు సాష్టాంగ నమస్కారాలు చేస్తూ గూళద లక్ష్మమ్మ అవ్వకు మొక్కులు తీర్చుకున్నారు. తమ నియోజకవర్గం అభివృద్ధి బాటలో కొనసాగాలని కోరుకున్నట్టు తెలిపారు. అలాగే ముంగారు వర్షం కూడా సమృద్ధిగా కురిసి ప్రజలు సకాలంలో పంటలు వేయాలని మొక్కుకున్నట్టు తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లోకాయుక్త సీఐ మహమ్మద్ రఫీక్

కంప్లి, ఏప్రిల్ 18 : ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తే వారి సమస్యలను పరిష్కరించాలని లోకాయుక్త సీఐ మహమ్మద్ రఫీక్ తెలిపారు. కంప్లి పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించామని, ఇప్పుడు వచ్చిన అర్జీలను కూడా అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్య, ఇతర సమస్యలు తలెత్తకుండా గ్రామ పంచాయతీ అధికారులు చూసుకోవాలని తెలిపారు. అలాగే ఈవో కూడా సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సమావేశంలో ఇచ్చిన ఫిర్యాదులపై తాలుకా ఈవో, జెస్కమ్ అధికారులతో చర్చించారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజ్, ఏఈ ప్రకాష్ మాలే, ఈవో శ్రీకుమార్, ముఖ్య అధికారి రెడ్డి రాయనగౌడ, డాక్టర్ అరుణ్‌కుమార్, రిజిస్టర్ ఆఫీసర్ రేణుక, పశువైద్యులు బసవరాజు, శ్రీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచ్చీరప్ప తాతకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఉచ్చీరప్ప తాత

సిరుగుప్ప, ఏప్రిల్ 18 : సిరుగుప్ప పట్టణం 24వ వార్డులో వెలసిన ఉచ్చీరప్ప తాతకు గురువారం భక్తులు ఆకుపూజ, పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఉచ్చీరప్ప తాత వారికి ధూపదీప నైవేద్యాలతో పూజలు జరిపి మహామంగళ హారతి నిర్వహించారు. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అనంతరం ప్రసాద పంపిణీ చేశారు.

హోసూరు జోన్

నిర్భయంగా ఓటెయ్యండి

- ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు

హోసూరు, చెన్నయ్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని, అందువల్ల ఎలాంటి భయాందోళనలకు లోను కాకుండా ప్రజలంతా ఓటుహక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు విజ్ఞప్తిచేశారు. సెయింట్ జార్జికోట ప్రాంగణంలోని సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు ఎటువంటి ఇబ్బంది లేని కారణంగా సార్వత్రిక ఎన్నికలను ఒకే విడతగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల సందేహాలు, అనుమానాల నివృత్తికి 1950 అనే టోల్ ఫ్రీ నెంబరు ఉపయోగించుకోవచ్చన్నారు.

ఓటింగ్ యంత్రాలు వార్డులకు తరలింపు



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి) ఏప్రిల్ 18 : కృష్ణగిరి పార్లమెంటరీ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈవీయంలను పరిశీలించి ఆయా వార్డులకు తరలిస్తున్నారు. జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు వ్యక్తిగతంగా జిల్లా రెవిన్యూ అధికారి ఎ.సాధనకురళ్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తమిళరసి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యానికి బాలింత బలి

హోసూరు ఏప్రిల్ 18 : హోసూరు పక్కనే ఉన్న ఆనేకల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం కోసం చేరిన గర్భిణి ప్రసవం తర్వాత మృతి చెందింది. బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆనేకల్ నగర్ ప్రాంతానికి చెందిన నారాయణప్ప , మునిలక్ష్మమ్మ దంపతుల కుమార్తె కవిత(24)కు మూడేళ్ల క్రితం జిగిని సమీపంల్లోని కోణసంద్రం ప్రాంతానికి చెందిన సంతోష్‌తో వివాహమైంది. సంతోష్, కవిత దంపతులకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కవిత రెండవ సారి ప్రసవం కోసం బుధవారం ఆనేకల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. ఈ స్థితిలో కవితకు వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. అందమైన ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కవిత తన బిడ్డను చూసి మురిసి పోయింది. కానీ ఉన్నట్టుండి కవిత కడుపు ఉబ్బి పెద్దదిగా మారింది. తీవ్ర రక్తస్రావం కావడంతో ఈ విషయాన్ని బంధువులు వైద్యులకు తెలియజేయడంతో వైద్యులు కవితను శస్త్రచికిత్స గదికి తీసుకెళ్లి మరో ఆపరేషన్ చేయాల్సి ఉందన్నారు. అయితే కొంతసేపటికి వైద్యులు బయటకు వచ్చి ఆమె పరిస్థితి విషమంగా ఉందని, రక్తస్రావం ఎక్కువగా ఉందని, అందుకే బెంగళూరు ఆసుపత్రికి తీసుకెళ్లమని సూచించారు. దీంతో తల్లి తండ్రులు, బంధువులు కవితను అంబులెన్స్‌లో బొమ్మసంద్రం ప్రాంతంలోని ఓ ప్రముఖ ఆసుపత్రికి తరలించారు. అక్కడ తనిఖీ చేసిన వైద్యులు తల్లి కవిత అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీంతో దిగ్భ్రాంతి చెందిన బంధువులు ఆమె ప్రసవించిన ప్రైవేట్ ఆసుపత్రిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని తెలిపారు. ఆనేకల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మృతి చెందిన కవిత మృతదేహాన్ని ప్రైవేట్ ఆస్పత్రిలో స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో సంచలనం సృష్టించింది.



కవిత (ఫైల్)

రాయచూరులో జోరుగా నామినేషన్లు

రాయచూరు, ఏప్రిల్ 18: లోకసభ ఎన్నికల నామినేషన్‌లకు మరొక్క రోజు గడువు మాత్రమే మిగిలి ఉండగా గురువారం నామినేషన్‌ల దాకలు జోరందుకుంది. బీజేపీకి చెందిన సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ కాంగ్రెస్ అభ్యర్థి జీ కుమార్ నాయక్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ఎంపీ బీవీ నాయక్‌లు తమ నామినేషన్‌లను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. అభ్యర్థుల వెంట ఆయా పార్టీలకు చెందిన నాయకులు తరలివచ్చారు. బీజేపీ అభ్యర్థి తరపున జేడీఎస్ నాయకులు రాగా వారితో పాటు ఆ పార్టీకి చెందిన నరసింహలు నాయక్ స్వతంత్ర అభ్యర్థిగా తమ నామినేషన్ దాఖలు చేశారు.



నామినేషన్ అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి జి.కుమార్ నాయక్



నామినేషన్ అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి రాజా అమరేశ్వర్ నాయక్



భారీగా తరలి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు

దేశాభివృద్ధి కోసం మోదీకి అండగా నిలవాలి: జనార్దన రెడ్డి

రాయచూరు, ఏప్రిల్ 18 : దేశ సమగ్ర అభివృద్ధితో పాటు దేశరక్షణ భద్రత కోసం ప్రజలు మోదీకి అండగా నిలవాలని మాజీ మంత్రి గాలి జనార్ధన్‌రెడ్డి కోరారు. గురువారం బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ నామినేషన్ దాఖలు అనంతరం నగరంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో జనార్ధన్ రెడ్డి మాట్లాడారు. ప్రజలు మూడవ సారి ప్రదాన మంత్రిగా నరేంద్ర మోదీని ఎన్నుకునేందుకు ఇప్పటికే మానసికంగా సిద్ధమయ్యారని ఆయన జోస్యం చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ఎక్కువ స్థానాల్లో గెలుపొందుతామనే భ్రమలో ఉన్నారన్నారు. బీజేపీ అభ్యర్థి రాజా అమరేశ్వర్ నాయక్‌కు ప్రజలు అండగా నిలవాలన్నారు.